# ఒక కాఫ్కా రాత్రి రహస్యం

నిశ్శబ్దంగా నేలమీంచి పైకి లేచి
గబ్బిలాల్లాగా ఎగిరొచ్చి
రాళ్ళ మీద వాలుతుంది
వాలి వేచి వుంటుంది
గడ్డి మీద కూడా వాలుతుంది

బూడిద రంగు రెక్కల్తో
మేకు నించి మేకు మీదికి
పాకుతుంది చప్పుడు చెయ్యకుండా
చీకటి నలుపులో
ఒక ఇనప రేకు నించి
ఇంకో ఇనప రేకు మీదికి
దొరికిన వాటన్నిటినీ మెల్లగా పూర్తిగా
తడిమి తడిమి పరీక్షిస్తుంది
ఆఖరి సమయం వచ్చిందా లేదా అని
ఎన్జిన్‌ల పిస్టన్‌లు మగత నిద్రలో వున్నప్పుడు
వంతెనల గర్డర్లు
చీకటి వర్షంలో
కాళ్ళు జాపి పడుకున్నప్పుడు

రక్త సిక్త హస్తాల్తో
తన పనిని తను పూర్తి చేసుకుంటుంది
నక్షత్రాల చిమ్మట పురుగులు
ఆకాశం పలక మీద
గుంపులు గుంపులుగా కూచుని
నిదానంగా నిదానంగా
ఎగురుతూ వచ్చి వాలుతాయి
నగరాల దీపాల మీద

భూమి చెవుల్లోకి

ఏదో రహస్యపు

విధ్వంసాన్ని

వూదుతున్నట్లుగా

— త్రిపుర